సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 15 । జూన్ । 2025



'నీట్'గా మెరిశారు..

నేషనల్ ఎల్జిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో ఆయా కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. - 8లో▸



ప్రమాణం చేసి ప్రాణాలు తీస్తారా?

భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవులు చేపట్టి ఆపరేషన్ కగార్ పేరిట దేశ పౌరుల ప్రాణాలు తీస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /27^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రతతో ఉక్కపోత ఉంటుంది. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి

● శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్



సాక్షి స్పందన

మహబూబాబాద్: మాంసం విక్రయదారులు కనీస నిబంధనలు పాటించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. మాంసం విక్రయదారులు గొర్రెలు, మేకలు కోసే విషయంలో, షాపుల నిర్వహణ తదితర అంశాలపై ఈ నెల 14(శనివారం)న 'వ్యాపారుల ఇష్టారాజ్యం' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనంపై కమిషనర్ రాజేశ్వర్ స్పందించారు. మాంసం విక్రయదారులకు నోటీసులు ఇచ్చి విక్రయాలపై అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఈనేపథ్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ మాంసం విక్రయదారులతో మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. ఆరోగ్యంగా ఉన్న జీవాలను కోయాలన్నారు. పశు వధశాల లేనందున కనీస నిబంధనలు పాటించాలన్నారు. ధరలు తగ్గించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే మాంసం విక్రయదారులతో సమావేశం ఉంటుందని ఆ సమావేశానికి వ్యాపారులు హాజరు కావాలని తెలిపారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని మానుకోట జిల్లా ఉద్యమకారులు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ కోరారు. అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారికి కలెక్టరేట్‌లో శనివారం ఉద్యమకారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కేసుల పాలయ్యామని అన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారులు పిల్లి సుధాకర్, ఎండీ వాహేద్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

● పింగిళి రమేష్‌రెడ్డి



మహబూబాబాద్ అర్బన్: గిరిజన జిల్లాల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను, బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించాలని బ్యాడ్మింటన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పింగిళి రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరకాలనీ గిరిజన భవనంలో శనివారం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పింగిళి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు పుట్టినిల్లు మానుకోట జిల్లా అని.. ఈ ప్రాంతంలో బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించి జిల్లాను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి నాగకిషన్, జిల్లా కార్యదర్శి కొమ్ము రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వద్దిరాజు వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ సర్వయ్య, సహాయకార్యదర్శి సాంబమూర్తి, కోశాధికారి శంకర్, సభ్యులు శ్యామ్, కిషోర్, ప్రవీణ్, సతీష్, కోటిరెడ్డి, క్రీడకారులు పాల్గొన్నారు.

నాన్న.. కలలకు నిచ్చెన



కష్టాలెన్నున్నా.. చిరునవ్వు ఒలకబోస్తాడు. కన్నీటి సుడులు ఉప్పెనై పొంగుతున్నా.. పంటి బిగువన అదిమి పడతాడు. తాను మాసిన గడ్డంతో ఉన్నా.. పిల్లల బట్టలు మెరవాలంటాడు. తన కోరికలు చంపుకునైనా.. పిల్లలు కోరినవేవైనా చిటికెలో పట్టుకొస్తాడు. తాను కడుపు నిండా తినకపోయినా.. కంటి నిండా నిద్రపోకపోయినా కుటుంబం కోసం అడ్జెస్ట్ అవుతాడు. పిల్లల జీవితాలకు రంగులద్దుతాడు. వారి కలలకు నిచ్చెన వుతాడు. ప్రతీ కుటుంబానికి నాన్న ఓ హీరో. నేడు (ఆదివారం) ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

సండే స్పెషల్

- పిల్లల జీవితాలకు రంగులద్దుతున్న తండ్రులు
- త్యాగాలు చేస్తూ.. కన్నీళ్లు మోస్తూ.. శక్తికి మించి పనిచేస్తూ
- కడుపున పుట్టినవారు ఉన్నతంగా బతకాలని వారందరి తపన
- ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా ఫాదర్స్

● నేడు ఫాదర్స్ డే

నాన్న ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి..



వరంగల్ క్రైం: చిన్నప్పటి నుంచి మా నాన్న జన్నైల్‌సింగ్ నాలో నింపిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకున్నాను. వృత్తిరీత్యా నాన్న ప్రిన్సిపాల్ కావడంతో చదువులో ప్రోత్సాహం అందించారు. ముఖ్యంగా సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయంలో ఆయన చేసిన మోటివేషన్ నాలో రెట్టింపు ఉత్సాహం నింపింది. చిన్నప్పటి నుంచి ప్రతీ విషయంలో అవగాహన కల్పించేవారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచేలా తీర్చిదిద్దారు. సామాజిక సమస్యలు, వాటిని ఎదుర్కొంటున్న ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన కల్పించారు. చదువుకు ఉన్న ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు ప్రతీ దశలో వెన్నంటి ప్రోత్సహించారు.

– సన్‌ప్రీత్ సింగ్, వరంగల్ పోలీస్ కమిషనర్

వందలాది పిల్లలకు దేవుడిచ్చిన నాన్న



అనాథ బాలికతో గాదె ఇన్నయ్య

జఫర్‌గఢ్: కన్నపిల్లలు కాకున్నా.. వందలాది మంది పిల్లలతో నాన్న అని పిలిపించుకుంటున్నారు 'మా ఇల్లు' అనాథ ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నయ్య. మండలంలోని రేగడి తండా గ్రామ శివారు టీబీ తండా వద్ద ఉన్న 'మా ఇల్లు ప్రజాధరణ అనాథ ఆశ్రమం'లో రెండు దశాబ్దాలుగా ఎంతో మంది అనాథలను అక్కున చేర్చుకుని ఆశ్రమంలో చోటు కల్పించారు. వారికి అన్ని సౌకర్యాలను కల్పిస్తూ ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారు గాదె ఇన్నయ్య. అనాథ పిల్లలపై తండ్రి ప్రేమను పంచుతూ.. పిల్లల అభిమానాన్ని పొందుతున్నారు. ఆశ్రమంలోని పిల్లలు తమ ఆధార్ కార్డుల్లో, పాఠశాలల రికార్డుల్లో సైతం ఇన్నయ్య పేరునే తమ తండ్రిగా రాయించడం విశేషం. ఈసందర్భంగా గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. ఎంతో మంది అనాథ పిల్లలతో నాన్న అని పిలిపించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పిల్లలు కూడా తనను తండ్రిలాగే భావిస్తూ తనపై అభిమానం చూపుతున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు కూడా ఆశ్రమంలో ఇన్నయ్యను నాన్న అంటూ ఆప్యాయంగా పిలుస్తుంటారు ఇలా.. పిలవడమే తమకిష్టం అని పిల్లలు చెబుతున్నారు. 'తండ్రి లేని లోటును తీరుస్తున్న ఇన్నయ్యే మా నాన్న' అంటూ వారు పేర్కొనడం గమనార్హం.

వ్యవసాయం చేసి.. కుమారుడిని చదివించి



శంకర్‌తో కుమారుడు శ్రవణ్ కుమార్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం సోమ్లతండాకు చెందిన భూక్య శంకర్ వ్యవసాయం చేస్తూ కుమారుడిని ఉన్నతంగా చదివించారు. తండ్రి కష్టాన్ని దగ్గర నుంచి చూసిన శ్రవణ్ కుమార్ ముంబైలోని ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం బీహెచ్ఈఎల్ కంపెనీలో ఆయిల్ అండ్ రిగ్స్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన ఎదుగుదలకు తండ్రి అందించిన ప్రోత్సాహమే కారణమని, తండ్రిని కష్టపెట్టకుండా చూసుకుంటానని శ్రవణ్ చెబుతున్నారు.

తండ్రి తాపీ మేస్త్రీ.. కుమార్తె డాక్టర్



కూతుళ్లతో వీరస్వామి

కాజీపేట రూరల్: ఆయన చదువుకోలేదు. తనలా పిల్లలు కావొద్దని బాగా చదివించాడు. సమాజంలో గొప్ప స్థాయిలో కూతుళ్లను చూస్తూ మురిసిపోతున్నాడు కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన తాపీమేస్త్రీ లింగాల వీరస్వామి. వీరస్వామికి ఇద్దరు కూతుళ్లు. 15 ఏళ్ల క్రితం భార్య చనిపోయింది. పెద్ద కూతురు హేమలతను వైద్య విద్య చదివించాడు. ఆమె ప్రస్తుతం జగిత్యాల జిల్లా ప్రైమరీ వెటర్నరీ సెంటర్ పెగడపల్లిలో అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్నారు. చిన్న కూతురు సుమలత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. నాన్న జీవితమే తమకు ప్రేరణనిచ్చిందని.. సుమలత, హేమలత చెబుతున్నారు.

భూమి అమ్మి చదివించారు..



తండ్రి రవీందర్‌తో వైద్యుడు ప్రశాంత్

నల్లబెల్లి: చదువు ఒక్కటే తరగని ఆస్తి అని బలంగా నమ్మారు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన ఈర్ల రవీందర్. కూలీ చేసి కొనుక్కున్న 4 ఎకరాల భూమిని కుమారుడు ప్రశాంత్ చదువు కోసం అమ్మేశారు. తండ్రి కష్టాన్ని ప్రత్యక్షంగా చూసిన ప్రశాంత్ ఇష్టంగా చదివారు. ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగంలో పని చేస్తున్నారు. 'నాకోసం భూమి అమ్మి కుటుంబ పోషణ కోసం నాన్న 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. నాన్న ప్రోత్సాహమే నన్ను వైద్యుడిని చేసింది. నా విజయం నాన్నకు అంకితం' అంటున్నారు ప్రశాంత్.

నడిచే దైవం.. నాకు తొలినేస్తం



ఇట్టబోయిన సాయి శివాని

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన రాజు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తూ పిల్లల్ని చదివించారు. తండ్రి కష్టానికి ఫలితంగా.. కుమార్తె సాయి శివాని ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించారు. ఆమె సాక్షితో మాట్లాడుతూ.. 'కలెక్టర్ కాలన్నది నా లక్ష్యం కాదు. మానాన్న కోరిక. ఆయన ఎంత కష్టాన్నైనా పైకి కనపడనివ్వకుండా తనలోనే దాచుకుంటారు. నేను ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని తపిస్తారు. ఇంజనీరింగ్ ఈసీఈ పూర్తయిన అనంతరం ఇంటి వద్ద ఉంటూ రోజూ 18 గంటలకుపైగా సివిల్స్‌కు సన్నద్ధమయ్యా. ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్‌లో 11వ ర్యాంకు సాధించా. 'నువ్వు కలెక్టర్ కావాలమ్మా' అనేవారు. ఆయన నడిచే దైవం. నాకు తొలినేస్తం. ఆయన నింపిన స్ఫూర్తే నన్ను ఈ స్థానంలో నిలబెట్టింది.

నాన్న కష్టమే.. ప్రాణం పోస్తోంది!



తండ్రి మల్లేశ్‌తో డాక్టర్ నవీన్

టేకుమట్ల: టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన మొదటి వ్యక్తి ఏకు నవీన్. డాక్టర్‌గా ఉద్యోగం చేస్తూ లావణ్య హాస్పిటల్ నెలకొల్పడానికి ఆయన నాన్న మల్లేశ్ పూర్తి సహకారం అందించారు. 'తాను వ్యవసాయం చేస్తూ..ఎంతో మందికి ప్రాణం పోసేలా నన్ను తీర్చిదిద్దాడు. తాను ఈస్థాయిలో ఉండడానికి మా నాన్న నాకోసం పడిన కష్టమే కారణం' అని నవీన్ చెబుతున్నారు. తన తండ్రి భౌతికంగా దూరమైనా ప్రతీ అడుగులో తన వెంటే ఉంటాడని డాక్టర్ నవీన్ భావోద్వేగంతో చెబుతున్నాడు.

శాంతియుత వాతావరణంలో జీవించాలి

● జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ



మాట్లాడుతున్న జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్: ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణంలో జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనాల సముదాయం ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై బరువు తగ్గించేందుకు, వివిధ కేసుల్లో ఇరువర్గాల వారితో మాట్లాడి పరిష్కరిస్తారని తెలిపారు. కేసుల కొట్టివేత కోసం నిరంతరం కోర్టు చుట్టూ తిరుగుతూ ఇబ్బందిపడొద్దనే ఆలోచనతో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆరు కోర్టుల్లో 13,500 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని, ఇలాగైతే కేసుల సంఖ్య పెరిగిపోతుందని అన్నారు. నేర ప్రవృత్తిని తగ్గించాలని, లోక్ అదాలత్ ఒక పరిష్కార వేదికగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, డీఎస్పీ తిరుపతిరావు, ప్రభుత్వ న్యాయవాది తోర్నాల నగేష్ కుమార్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

8,495 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా 8,495 కేసులను పరిష్కరించగా ఇందులో వివిధ రకాల 2,437 కోర్టు కేసులు, 5,465 పోలీస్ చలాన కేసులు ఉన్నాయి. వాటితోపాటుగా 15 మోటార్ వాహన ప్రమాద కేసుల్లో రూ.59.85 లక్షల నష్టపరిహారాన్ని బాధితులకు చెల్లించే విధంగా ఆదేశించారు. 497 క్రిమినల్ కేసుల్లో నేరాన్ని అంగీకరించిన వారికి రూ.32.88 లక్షల 400 రూపాయల జరిమానా విధించారు. 17 సైబర్ నేరాల కేసులు పరిష్కారమవ్వగా రూ.2.62 లక్షలను బాధితులకు తిరిగి ఇచ్చే విధంగా ఆదేశించారు. 53 టెలిఫోన్, సైబర్, బ్యాంకు సంబంధిత కేసులు పరిష్కారం అవ్వగా వాటిలో కక్షిదారులు రూ.13 వేల 170 రూపాయలు చెల్లించి రాజీ చేసుకున్నారు. 7 సివిల్ కేసులు, 4 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారమయ్యాయి.

588 కేసుల పరిష్కారం

తొర్రూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 588 కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసుల విచారణ చేపట్టి సివిల్, క్రిమినల్, పెటీ, ఎక్సైజ్, సైబర్ క్రైమ్ తదితర కేసులు పరిష్కరించారు. అన్ని కేసుల్లో జరిమానా కింద రూ.20.5 లక్షలు విధించారు. కార్యక్రమంలో ఏపీపీ రేవతిదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముకుందరావు, సీఐ గణేష్, బార్ ప్రతినిధులు అశోక్, భాస్కర్, వెంకన్న, ఐలోని, మహేష్, కుమార్‌లు పాల్గొన్నారు.

పెరిగిన పెంకు కార్మికుల వేతనాలు

ఇల్లెందురూరల్: పెంకు పరిశ్రమల యజమానులు, తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధుల మధ్య చర్చలు ఫలప్రదం కావడంతో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కార్మికుల వేతనాలు పెరిగాయి. ఈమేరకు మహబూబాబాద్ జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సమక్షంలో ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం.. కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి గత రేట్లపై అదనంగా లోన పనులకు 4 శాతం, బయట పనులకు 5 శాతం, రోజువారీ కూలీ రేట్లపై అదనంగా రూ.10, గుమస్తాలకు ప్రస్తుత వేతనాలపై అదనంగా నెలకు రూ.400 చొప్పున పెంచనున్నారు. పెరిగాయి. ఈ ఒప్పందం 2026 జూన్ వరకు అమల్లో ఉంటుంది. చర్చల్లో తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాంసింగ్, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ, రంగబాబు, సత్తిబాబు, యజమానులు సాంబశివరావు, అరవింద్, విక్రమ్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన రోదన

జిల్లాలో వేర్వేరు చోట్ల విద్యుత్ ప్రమాదాలు

- మ్యారేజ్ డే మరుసటిరోజే వ్యక్తి మృతి
- ఒకరి మృత్యువాత.. మరొకరికి తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇనుగుర్తి వాసి



చిన్నారులను ఎత్తుకుని ఏడుస్తున్న అమ్మమ్మ



క్రాంతికుమార్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య

నెల్లికుదురు: భర్త మరణం భార్యకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. వివాహ వార్షికోత్సవం తర్వాత రోజే విద్యుత్ ప్రమాదరూపంలో మృత్యువాత పడడంతో ఆ కుటుంబ విషాదంలో మునిగిపోయింది. మరోచోట కరెంట్ షాక్‌తో వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. డోర్నకల్ మండలంలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్ (32) ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తూ శనివారం విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తీసుకురాగా అప్పటికే మృతిచెందాడు. క్రాంతికుమార్ మృతితో భార్య, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.

సంతోషం.. మరునాడే విషాదం

మృతుడు క్రాంతికుమార్ దంపతులు శుక్రవారం పెళ్లిరోజు వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన కాంత్రి మరుసటి రోజే మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తమను సంతోషంగా చూసుకుంటాడనుకున్న భర్త మృతితో భార్య రోదనలు మిన్నంటాయి.

ఫాదర్స్‌డే రోజున నాన్న లేడాయే...

క్రాంతికుమార్‌కు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. నేడు అందరూ ఫాదర్స్ డే జరుపుకుంటుండగా చిన్నారులకు మాత్రం కన్నతండ్రి దూరమైన పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఆ చిన్నారులు తమ తండ్రి చనిపోయిన విషయాన్ని సైతం తెలుసుకునే వయస్సులో లేకపోవడం కలిచివేస్తుంది.

ఇనుగుర్తిలో ఘటన...

జిల్లాలో ఒకే రోజు రెండు వేర్వేరు చోట్ల విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. డోర్నకల్‌లో జరిగిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఇనుగుర్తి శివారు వీరారెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అదే గ్రామానికి చెందిన బూర్గుల అంబేడ్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లో ఆస్పత్రికి తరలించారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

● మాజీ ఎంపీ సీతారాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం నాయక్

మహబూబాబాద్ అర్బన్/దంతాలపల్లి: రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో, దంతాలపల్లి మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం వేర్వేరుగా సీతారాంనాయక్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటవీ హక్కుచట్టం ప్రకారమే ఆదివాసీ గిరిజనులు వారి హక్కులు అడుగుతున్నారని అన్నారు. దేశంలో 720 గిరిజన తెగలు ఉన్నాయని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి అటవీ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కుపత్రాలు అందించాలని కోరారు. దేశంలోని 81 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రధాని మోదీ గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచిత రేషన్ అందచేస్తున్నారని గుర్తుచేశారు. మోదీ పాలనలో దేశం సాంకేతికంగా దూసుకెళ్తుందన్నారు. నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, శ్యాంసుందర్‌శర్మ, మహేష్, పూర్ణచందర్‌రెడ్డి, మురళి, ప్రవీణ్, ఉమేష్, రమేష్, రాణిరెడ్డి పాల్గొన్నారు.

మానుకోట నియోజకవర్గానికి వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు



మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుమతి ఇచ్చారని ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. హైదరాబాదులోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని.. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలోని ఆదివాసీ, గిరిజన ప్రాంతాల ప్రజలు ఇళ్లులేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి విన్నవించామని తెలిపారు. దీంతో అదనంగా 1,500 ఇందిరమ్మ ఇళ్లు కావాలని కోరగా సానుకూలంగా స్పందించిన 1,000 ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చారన్నారు. మానుకోట అభివృద్ధిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రాజేశ్‌కు రెండు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో కొలువులు


చిలుకమారి రాజేశ్‌

పాలకుర్తి టౌన్‌: పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన చిలుకమారి రాజేశ్‌ రెండు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించాడు. హరియాణాలోని నిట్‌ కురుక్షేత్ర, చెన్నైలోని కాంచీపురం ట్రిపుల్‌ ఐటీ అండ్‌ మాన్యుఫ్యాక్చరింగ్‌ టెక్నాలజీలో (ఐఐఐటీడీఎం)లో కంప్యూటర్‌ సైన్స్‌(సీఎస్‌సీ) విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఉద్యోగం సాధించాడు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన చిలుకమారి సమ్మయ్య, స్వరూప దంపతుల కుమారుడు రాజేశ్‌ పాలకుర్తిలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి, వరంగల్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో కంప్యూటర్‌ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్‌ కళాశాలలో సీఎస్‌ఐ బీటెక్‌ పూర్తి చేశాడు. నిట్‌ సిక్కింలో ఎంటెక్‌, నిట్‌ వరంగల్‌లో సీఎస్‌ఈలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వీఐటీ అమరావతిలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే నిట్‌ కురుక్షేత్ర, ఐఐఐటీడీఎం కాంచీపురంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో రాజేశ్‌ను పలువురు అభినందించారు.

పంచకర్మ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి


రాష్ట్ర ఆయుర్వేద సదస్సులో ప్రముఖ వైద్యులు

జనగామ: ఆయుర్వేద వైద్యంలో పంచకర్మ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రముఖ వైద్యులు సూచించారు. జనగామ వేద పంచకర్మ వెల్‌నెస్‌ సెంటర్‌, విశ్వ ఆయుర్వేద పరిషత్‌ తెలంగాణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్‌ లెవల్‌ కౌశలం-2025 సదస్సు జరుగుతోంది. శనివారం వేద డాక్టర్‌ అంజిరెడ్డి అధ్యక్షతన ఆయుర్వేద వైద్య శాస్త్రంపై నిర్వహించిన సదస్సులో ప్రముఖ అధ్యాపకులు, వైద్య నిపుణులు ప్రయోగాత్మకజ్ఞానంతో పాటు తమ అనుభవాలు పంచుకున్నారు. డాక్టర్‌ సరస్వతి హిమబాల మాట్లాడుతూ సంప్రదాయ గ్రంథాల నుంచి ఆధునిక వైద్య చికిత్సల వరకు ఆయుర్వేదంలో పొందుపరిచి ఉందన్నారు. డాక్టర్‌ పంతులు రఘుపతి మాట్లాడుతూ పంచకర్మను సాధారణ వైద్య ప్రయోగాల్లో సమర్థవంతంగా ఎలా అప్లయ్‌ చేయాలనే అంశంపై వివరణాత్మకంగా బోధించామన్నారు. డాక్టర్‌ సురేంద్రశర్మ మాట్లాడుతూ ఔషధ తయారీ ప్రక్రియ గురించి విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ద్వారా అవగాహన కల్పించామన్నారు. డాక్టర్‌ కిరణ్మయి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం గొప్పదనాన్ని తెలుసుకుని రోగులకు చికిత్స చేసే సమయంలో దానిని అమలు పర్చాలన్నారు. డాక్టర్‌ మల్లికార్జున్‌ మాట్లాడుతూ కంటి వ్యాధులు, దుష్ఫలితాలకు సంబంధించి అనేక మందికి ఆయుర్వేద వైద్యం ద్వారా చికిత్సలు చేసి విజయం సాధించామన్నారు. ఆయుర్వేద వైద్యంలో అద్భుత ఫలితాలు సాధించి, రుజువు చేయడమే కాకుండా, యువ వైద్యులకు శాస్త్రీయం, అనుభవాత్మకంగా పరిపూర్ణత సాధించేందుకే ఇలాంటి రాష్ట్ర స్థాయి సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.

నీట్‌గా మెరిశారు..

నేషనల్‌ ఎల్జిబిలిటీ కమ్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌ (నీట్‌-యూజీ -25) ఫలితాల్లో ఉమ్మడి వరంగల్‌ జిల్లా విద్యార్థులు మెరిశారు. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీనిపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ర్యాంకర్లు, తల్లిదండ్రులను సన్మించారు. -సాక్షి నెట్‌వర్క్‌

షణ్ముఖకు 48వ ర్యాంకు..

కేయూ క్యాంపస్‌: జాతీయ స్థాయిలో మెడిసిన్‌లో ప్రవేశాలకు గాను నిర్వహించిన నీట్‌ (నేషనల్‌ ఎల్జిబిలిటీ కమ్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌) ఫలితాల్లో హనుమకొండకు చెందిన యాంద్రపాటి షణ్ముఖ 720 మార్కులకు 656 మార్కులు సాధించి ఆల్‌ ఇండియా 48వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. హనుమకొండ టీచర్స్‌ కాలనీకి చెందిన యాంద్రపాటి శ్యాంసుందర్‌, రజనీదంపతుల కుమారుడు షణ్ముఖ పదో తరగతి హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో, ఇంటర్మీడియట్‌ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో చదివాడు. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండే షణ్ముఖ డాక్టర్‌ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివి శనివారం విడుదలైన నీట్‌ ఫలితాల్లో ఆల్‌ఇండియా స్థాయిలో సత్తాచాటాడు. దీనిపై తల్లిదండ్రులు శ్యాంసుందర్‌, రజనీ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, షణ్ముఖ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ విడుదల చేసిన ఏపీ ఎప్‌సెట్‌ అగ్రికల్చరల్‌, ఫార్మసీలోనూ రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు కూడా సాధించాడు.


తల్లిదండ్రులతో షణ్ముఖ

ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరుతా..

నీట్‌లో ఆల్‌ఇండియాలో 48వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. ఢిల్లీ ఎయిమ్స్‌ మెడిసిన్‌లో చేరుతా. డాక్టర్‌ కావాలనే లక్ష్యంతో చదివా. మా తల్లిదండ్రులు కూడా నన్ను ప్రోత్సహించారు.

షణ్ముఖ, నీట్‌ 48వ ర్యాంకర్‌

మానుకోట విద్యార్థుల ప్రతిభ..


ప్రణీతమ్‌సుహాస్‌


వర్షితారెడ్డి

మహబూబాబాద్‌ అర్బన్‌: నీట్‌ ఫలితాల్లో మానుకోట విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ కళాశాల అధ్యాపకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్‌, మాధురి దంపతుల కుమారుడు ప్రణీతమ్‌ సుహాస్‌ 720 మార్కులకు 408 మార్కులు సాధించాడు. అదేవిధంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొల్లం వెంకట్‌రెడ్డి, సుజాత దంపతుల కుమార్తె వర్షితారెడ్డి 720 మార్కులకు 431 మార్కులు సాధించింది. అలాగే, పిట్టల శ్రీమతి, మహేందర్‌ దంపతుల కుమార్తె అభిన్య 720 మార్కులకు 500 మార్కులు సాధించింది.

శాంతన్‌ సత్తా..


శాంతన్‌

గూడూరు: మండల కేంద్రానికి చెందిన స్ఫూర్తి వాహిణి, రాజ్‌కుమార్‌ దంపతుల కుమారుడు పింగిళి శాంతన్‌ శనివారం విడుదలైన నీట్‌ పరీక్ష ఫలితాల్లో 401 మార్కులు సాధించాడు. గూడూరులోని ఓ ప్రైవేట్‌ విద్యాలయంలో 10వ తరగతి చదివిన శాంతన్‌.. హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ చదివాడు. ఎంబీబీఎస్‌లో ప్రవేశం కోసం నీట్‌ పరీక్ష రాశాడు. ఇందులో ఆల్‌ ఇండియాలో 2,08,998 ర్యాంకు వచ్చినట్లు శాంతన్‌ తెలిపాడు.

సుజిత్‌ ప్రతిభ..


జాటోత్‌ సుజిత్‌

దేవరుప్పుల : నీట్‌ ఫలితాల్లో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మాపురం రెవెన్యూ పరిధి పడమటితండాకు చెందిన జాటోత్‌ జ్యోతి, గోర్‌సింగ్‌ కుమారుడు సుజిత్‌ ప్రతిభచాటారు. జాతీయ స్థాయిలో11,189, ఎస్టీ కేటగిరీ ర్యాంకు 62 ర్యాంకు పొందారు. సుజిత్‌ జనగామ ఏకశిలలో పదో తరగతి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో ఇంటర్‌ చదివారు. కాగా, సుజిత్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

లిఖితకు 3,038 ర్యాంకు..


పోరిక లిఖిత

ములుగు రూరల్‌: ములుగు జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక సంధ్య, శ్రీనివాస్‌ దంపతుల కుమార్తె లిఖిత జాతీయ స్థాయిలో 3,038 ర్యాంకు సాధించింది. దీంతో లిఖితను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

వైష్ణవికి 410 మార్కులు..


వైష్ణవి

మహబూబాబాద్‌ అర్బన్‌: జిల్లా కేంద్రానికి చెందిన టీ స్టాల్‌ నిర్వాహకురాలు సుజాత కుమార్తె తోడుసు వైష్ణవి నీట్‌లో 720 మార్కులకు 410 మార్కులు సాధించింది. అమ్మ కల నేరవేర్చి పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తానని ఈ సందర్భంగా వైష్ణవి తెలిపింది.

ఆస్తి కోసమే హత్య!

- పథకం ప్రకారమే మర్డర్‌
- పినతల్లిని చంపిన కొడుకు..
- 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నాం
- హనుమకొండ ఏసీపీ నర్సింహారావు

హసన్‌పర్తి: ఆస్తి కోసమే పిన తల్లి (చిన్నమ్మ)ని కుమారుడు గొడ్డలితో నరికి హత్యచేశాడని హనుమకొండ ఏసీపీ నర్సింహారావు అన్నారు. ఈ మేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన చల్లా శ్రీనివాస్‌రెడ్డి మొదటి భార్యకు ముగ్గురు కుమారులు. 30ఏళ్ల క్రితం మొదటి భార్య వనమ్మ మృతి చెందగా, వివిధ కారణాలతో ఇద్దరు కుమారులు కూడా తనువు చాలించారు. చిన్న కుమారుడు చల్లా భూపాల్‌రెడ్డి ఆలనా పాలనా తండ్రి శ్రీనివాస్‌రెడ్డి చూసుకున్నాడు. కొంతకాలం తర్వాత సరోజన అనే మహిళను శ్రీనివాస్‌రెడ్డి రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు.

ఆస్తి తగదా..

శ్రీనివాస్‌రెడ్డి తనకున్న భూమిలో నుంచి 3.20 ఎకరాల భూమిని రెండో భార్య కూతుళ్ల పేర రిజిస్ట్రేషన్‌ చేయించాడు. దీంతో తనకు తెలియకుండా చెల్లెళ్ల పేరిట భూమి రిజిస్ట్రేషన్‌ చేయడంతో ఆ కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు ఆ గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి.

కొడుకుకు భూమి కౌలుకు ఇవ్వొద్దు..

కాగా, పదిరోజుల క్రితం శ్రీనివాస్‌రెడ్డి కాలుకు దెబ్బ తగలడంతో వ్యవసాయ పనులకు దూరమయ్యాడు. దీంతో తన పేరిట ఉన్న 2.20 ఎకరాల భూమిని కొడుకు చల్లా భూపాల్‌రెడ్డికి కౌలుకు ఇవ్వాలని నిర్ణయించాడు. దీంతో భార్య సరోజన నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఆ భూమిని అల్లుళ్లకు కౌలుకు ఇవ్వాలని సరోజన వాదిస్తూ వచ్చింది.

పథకంప్రకారం హత్య..


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నర్సింహారావు

తనకు తెలియకుండానే 3.20 ఎకరాల భూమిని కూతుళ్ల పేరిట రిజిస్ట్రేషన్‌చేసుకోవడమే కాకుండా తండ్రి భూమిని కూడా అల్లుళ్లకు ఇవ్వాలని పినతల్లి గొడవ చేయడంతో ఆమెనుఎలాగైనా హత్యచేయాలని భూపాల్‌రెడ్డి పథకం పన్నాడు. ఇందులో భాగంగా ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి పిన తల్లి సరోజన బయట నుంచి ఇంట్లోకి వస్తుండగా గేట్‌ వద్ద గొడ్డలితో నరికి హత్యచేశాడు. ఈ ఘటనపై మృతురాలి భర్త శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ వివరించారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, ఎస్సైలు రవీందర్‌, శ్రీకాంత్‌, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

నీట్‌-25 ఫలితాల్లో ‘ఎస్‌ఆర్‌’ ప్రభంజనం


పి. సాయిదివ్యాన్‌ బి. ప్రియాంక ఎం. వినయ్‌ బి. గణేశ్‌

విద్యారణ్యపురి : నేషనల్‌ ఎల్జిబిలిటీ కమ్‌ ఎంట్రెన్స్‌టెస్ట్‌ (నీట్‌-యూజీ -25 ఫలితాల్లో ‘ఎస్‌ఆర్‌’ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్‌ ఎ. వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌ రెడ్డి శనివారం తెలిపారు. నీట్‌ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అన్ని కేటగిరీలు కలిపి పి. సాయిదివ్యాన్‌ ఆల్‌ ఇండియాలో 14వ ర్యాంకు, బి. ప్రియాంక 100వ ర్యాంకు, ఎం. వినయ్‌ 226వ ర్యాంకు, బి. గణేశ్‌ 671వ ర్యాంకు సాధించారని వారు తెలిపారు. రాష్ట్రంలోని ‘ఎస్‌ఆర్‌’ విద్యాసంస్థలకు చెందిన 210 మందికిపైగా విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించేలా ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించేలా తమ విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. 50 సంవత్సరాల్లో పటిష్ట ప్రణాళికతో హైస్కూల్‌, జూనియర్‌ కాలేజీ, ఎంసెట్‌, ఐఐటీల్లో విద్యనందిస్తూ ప్రతీ ఏడాది జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నామన్నారు. ఈఏడాది జేఈఈ మెయిన్స్‌ -25 జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని వారు చెప్పారు. ఈ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని తాము ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

‘షైన్‌’ విద్యార్థుల విజయదుందుభి


జి. కీర్తన కె. సహస్ర డి. ఇందు టి. వెంకటశివాణి

హన్మకొండ : నీట్‌-2025 ఫలితాల్లో ‘షైన్‌’ జూనియర్‌ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా నీట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ‘షైన్‌’ విద్యా సంస్థల చైర్మన్‌ మూగల కుమార్‌ తెలిపారు. షైన్‌ విద్యాసంస్థలు మొదటి నుంచి, నీట్‌, జేఈఈ, మెయిన్స్‌, అడ్వాన్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నాయన్నారు. నీట్‌లో జాతీయ స్థాయిలో జి. కీర్తన -498 మార్కులు , కె. సహస్ర- 497, డి. ఇందు- 437, ఇ. వెంకట శివాణి-427 మార్కులు సాధించారని వివరించారు. వీరితో పాటు 15 మంది విద్యార్థులు 300 పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను షైన్‌ విద్యాసంస్థల చైర్మన్‌ మూగల కుమార్‌, డైరెక్టర్లు మూగల రమ, మూగల రమేశ్‌, అధ్యాపకులు అభినందించారు.

‘శివాని’ విద్యార్థుల విజయకేతనం


ముఖేశ్‌ మనోజ్‌ కార్తీక్‌ నిస్సి

హసన్‌పర్తి: నీట్‌-2025 ఫలితాల్లో నగరంలోని శివాని కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. కళాశాలకు చెందిన మాధురీముఖేశ్‌(495/720), ఆడెపు మనోజ్‌(451/720), ఇ.కార్తీక్‌(443/720), ఆరికెళ్ల నిస్సి(438/720) మార్కులు సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్‌ టి. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి,వి.చంద్రమోహన్‌,డైరెక్టర్లు రాజు, ఎస్‌.రమేశ్‌, ఎ. మురళీధర్‌, వి. సురేశ్‌, ఎస్‌. సంతోశ్‌రెడ్డి అభినందించారు.

ప్రమాణంచేసి పౌరుల ప్రాణాలు తీస్తారా!

- చట్టపరంగా శిక్షించాల్సి ఉన్నా చంపడం అప్రజాస్వామికం
- ఎన్‌కౌంటర్లపై ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సాక్షిప్రతినిధి, వరంగల్‌ : ‘ప్రశ్నించేవారంటే నరేంద్ర మోదీకి భయం.. ఎర్రజెండా పార్టీలు, కమ్యూనిస్టులను లేకుండా చేయడానికి హత్యాకాండ కొనసాగిస్తున్నారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవులు చేపట్టి ఆపరేషన్‌ కగార్‌ పేరిట దేశ పౌరుల ప్రాణాలు తీస్తున్నారు’ అని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం హనుమకొండ కాకతీయ హోటల్‌లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని, ఇంకా 11 మంది కీలక మావోయిస్టు నేతలు ఉన్నారని ప్రకటించడం అప్రజాస్వామికం, ఆటవికమని పేర్కొన్నారు. చట్టపరంగా శిక్షించాల్సి ఉన్నా చంపడం అప్రజాస్వామికమన్నారు. ఆపరేషన్‌ కగార్‌ను ఆపేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్‌ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ.. ‘కాళేశ్వరం ప్రాజెక్టు తెల్ల ఏనుగు లాంటిది.. ఏటా రూ.25వేల కోట్లకు పైగా మెయింటనెన్స్‌ కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఆ ప్రాజెక్టు పనికిరాదు.. కాబట్టి కాళేశ్వరం ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలి. జనాల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు.

అర్హులకు పథకాలు అందాలి

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలను రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హులకు అందించాలని సాంబశివరావు సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల్లో జర్నలిస్టులు, కార్మికులు, అసంఘటిత కార్మికులను కచ్చితంగా భాగస్వాములను చేయాలని సూచించారు. జర్నలిస్టులకు సర్కారు ఆసరా కావాలని, ఉచిత విద్య, ఆరోగ్యకార్డులు అందజేయాలన్నారు. ఇదిలా ఉండగా.. ‘ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏపీసోడ్‌ను తాము రాజకీయంగా చూడడం లేదు. కానీ.. అందులో పొలిటికల్‌ ఇన్‌వాల్వ్‌మెంట్‌ ఉన్నట్లుగా కనిపిస్తుంది’ అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కూనంనేని సాంబశివరావు పై విధంగా స్పందించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్‌, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్‌, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్‌, తదితరులు పాల్గొన్నారు.



EDUCATION

■ Admissions Open GNM, B.Sc Nursing, B.Sc MLT, B.Voc(all), B.Tech, BPharm, Diploma-MLT, OA, OM, ANS, MIT, DIALYSIS, MPHA (M), Inter-MLT, MPHW(F), CS, A&T, PSTT @ 9515137392. [SCA25004981]

DISTANCE EDUCATION

■ మావద్ద ఓపెన్‌ 10th, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, B.Sc (Agri), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సంప్ర. 99481 31154. [SCA 25004771]

REAL ESTATE

HOUSE FOR SALE

■ KOMPALLY-HYD NEW TRIPLEX VILLA, Furnished, 238 Sq.Yds. 3545 Sft,5BHK,NCL Colony,Int.Lift. Facing N-E @3.5 Cr. Cell : 9440631039 [H-1265942]

PLOT FOR SALE

■ 800 Sq. yards plot at Supriya Cold storage, Gorrekuntta, Warangal. 170 Sq. yards at Venkatadri nagar, Direct Party Kazipet. Ph: 93987 83805. [M 13605]

SERVICES

■ పద్మావతి ఫైనాన్స్‌: హౌసింగ్‌, బిజినెస్‌, మార్టిగేజ్‌, పర్సనల్‌, ఓపెన్‌ ప్లాట్స్‌పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్‌, GST లైసెన్స్‌ చేయబడును. WGL. 9618767116. [SCA25004490]

LOANS

■ శివబాలాజీ లోన్స్‌: స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, టేకోవర్‌ లోన్స్‌, అన్ని రకాల వ్యాపారులకు లోన్స్‌, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్‌, సిబిల్‌ లేకున్నా, సిబిల్‌ బ్యాడ్‌ ఉన్నా లోన్స్‌ ఇవ్వబడును. WGL- 8522825358 [WA-6702]

DOCUMENT MISSING

■ Marka Saikeerthi, D/o. Ravi, R/o. H.No.13-94, కుమ్మరివాడ, పరకాల గ్రామం & మం. జిల్లా హనుమకొండ గార్లవి ఒరిజినల్‌ హౌస్‌ & ఓపెన్‌ ప్లేస్‌ 207.49 sq.yrdsవి రిజిస్ట్రేషన్‌ డాక్యుమెంట్స్‌ నెం.1868/2024 గలవి తీసుకొని తేది. 20-05-2025 రోజున సాయిబాబా గుడి నుండి పరకాలకి వస్తుండగా పోయాయి దొరికిన వారు సంప్ర।। 6305753379. [SCA25005029]

డాక్యుమెంట్స్‌ పోయినవి

■ ANSIA SEEMA, W/o. Abdul Rahman Mohammed, R/o. H.No. 4-1-89, Gundlagadda Jangaon Town & Mdl Jangaon Dist గార్లవి ఒరిజినల్‌ రిజిస్ట్రేషన్‌ Plot Document. No. 8620/2023 & Link Document No. 1572/2002 గలవి House Shift చేస్తుండగా పోయాయి. దొరికినవారు సంప్ర।। 9603725855. [SCA25005039]

BUSINESS OFFER

■ Need Monthly Income? Get from your Own Forex Trading Account, Profit Sharing / Fixed Returns. Safe & Secure. Ph: 6301859174 [SCA25004901]

WANTED

■ హన్మకొండ గల రామప్ప జూనియర్‌ కళాశాలలో పనిచేయుటకు వార్డెన్‌ (8), Male (4), Female (4), టెలికాలర్స్‌ (2), రిసెప్షన్‌ (2) కావలెను. సంప్ర।। 7416936037, 6301274545. [WA-34]

■ ప్రముఖ కార్పొరేట్‌ కంపెనీలో పని చేయుటకు మార్కెటింగ్‌ & జనరల్‌ మేనేజర్స్‌ స్త్రీ/పు।। కావలెను. + vrs వారికి ప్రాధాన్యత. 9866137009, 9866194585. [SCA25004708]

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్‌ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th - డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239 [SCA 25004985]

FACULTY TEACHERS

■ Lady Principal with B.ed and Maths, Eng. Computer for Primary and all sub for Higher. Master's High School, Fort Warangal. Cell: 8790720106, 9347903778. [SCA25004915]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్‌	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్‌	9010144453
పరకాల	9010299096
జయశంకర్‌ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము


33 కేవీ విద్యుత్‌ లైన్‌లో డిస్కుల సమస్య

- నాసిరకం డిస్కులు, ఇన్సులేటర్లతో అవస్థలు
- మార్చించాలని సీఎండీ ఆదేశం
- రెండున్నర నెలలు గడుస్తున్నా మార్చని అధికారులు
- విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: 33 కేవీ విద్యుత్‌ లైన్‌లో తరచూ విద్యుత్‌ అంతరాయాలు కలుగుతుండడంతో సమస్య గుర్తించేందుకు విద్యుత్‌ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్‌ మహానగర పాలక సంస్థ పరిధి ఆరెపల్లి 220 కేవీ సబ్‌ స్టేషన్‌ నుంచి వరంగల్‌ ఉర్సు, హనుమకొండలోని న్యూ శాయంపేట వరకు మూడు సంవత్సరాల క్రితం 33 కేవీ లైన్‌ వేశారు. ఈ విద్యుత్‌ లైన్‌ ఏర్పాటైనప్పటి నుంచి తమకు అవస్థలు తప్పడం లేదని విద్యుత్‌ ఉద్యోగులు వాపోతున్నారు. నాసిరకం డిస్కులు, ఇన్సులేటర్లు వాడడంతో అవి తరచూ పగిలిపోయి విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, ఈ సమస్యను గుర్తించడానికి పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. పగిలిన డిస్క్‌, ఇన్సులేటర్‌ గుర్తించడానికి ప్రతీ స్తంభాన్ని ఎక్కి దిగాల్సి వస్తోందని వాపోయారు. స్తంభం ఎక్కితేనే పగిలింది కనిపిస్తుందని, కింది నుంచి చూస్తే ఫాల్ట్‌ దొరకడం లేదని తెలిపారు. విద్యుత్‌ లైన్‌ వేసిన క్రమంలో నాణ్యమైన మెటీరియల్‌ వాడకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతుందని అంటున్నారు. ఈ విద్యుత్‌ లైన్‌లో తరచూ సరఫరాలో అంతరాయం కలుగడం, డిస్కులు, ఇన్సులేటర్లు ఫెయిల్‌ కావడంపై టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఏప్రిల్‌లో జరిగిన సమీక్షలో విద్యుత్‌ లైన్‌ వేసిన కాంట్రాక్టర్‌ ద్వారా డిస్కులు, ఇన్సులేటర్లన్ని మార్చించాలని సంబంధిత అధికారిని ఆదేశించారని సమాచారం. కానీ, వాటిని మార్చకపోవడంతో సమస్య పునరావృతమవుతూనే ఉంది. వారానికి ఒకసారి డిస్క్‌, ఇన్సులేటర్‌ ఫెయిల్‌, షాట్‌ సర్క్యూట్‌తో బ్రేక్‌ డౌన్‌ అవుతూ విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుంది. రెండేళ్లలో 18 డిస్కులు మార్చినట్లు ఉద్యోగ వర్గాలు తెలిపాయి. కాంట్రాక్టర్‌తో నాణ్యమైన డిస్కులు, ఇన్సులేటర్లు బిగించకపోతే విద్యుత్‌ అంతరాయాలు తప్పవని, ఫాల్ట్‌ కనుక్కోవడానికి ప్రతీ స్తంభం ఎక్కి దిగాల్సిందేనని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా టీజీ ఎన్పీడీసీఎల్‌ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీఎండీ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్‌తో నాణ్యమైన డిస్కులు, ఇన్సులేటర్లు ఏర్పాటు చేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

టైర్‌ పగిలి డీసీఎం బోల్తా..

- యువకుడి మృతి.. ముగ్గురికి గాయాలు
- మడికొండ ఔటర్‌ రింగ్‌ రోడ్డుపై ఘటన



మడికొండ: టైర్‌ పగిలి డీసీఎం బోల్తాపడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మడికొండ ఔటర్‌ రింగ్‌ రోడ్డుపై జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్‌ కిషన్‌ కథనం ప్రకారం.. డీసీఎంలో ఎస్‌బీఐ బ్యాంకు లాకర్లను తీసుకుని హైదరాబాద్‌ నుంచి భూపాలపల్లికి నలుగురు బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 8.30 గంటల ప్రాంతంలో మడికొండ శివారు టెక్స్‌టైల్‌ పార్కు సమీపంలో డీసీఎం వెనుక టైర్‌ పగిలింది. దీంతో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో లాకర్‌ మీదపడి హైదరాబాద్‌కు చెందిన ఎండీ జావీద్‌ఖాన్‌ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్‌ క్యాబిన్‌లో ఉన్న ముగ్గురు ఎండి. హబీబ్‌ ఖాన్‌, ఎండి. మోయిజ్‌ఖాన్‌, ఎండి. సలీమ్‌ఖాన్‌కు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించి, మృతదేహాన్ని పంచనామ నిమిత్తం ఇదే ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు. మృతుడి బంధువు మోయిన్‌ఖాన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ పేర్కొన్నారు.

90 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

- డీసీఎం సీజ్‌
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎక్సైజ్‌ అధికారి కిరణ్‌


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎక్సైజ్‌ అధికారి కిరణ్‌

మహబూబాబాద్‌ రూరల్‌ : ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నుంచి మహబూబాబాద్‌ జిల్లాకు ఓ డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక, గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎక్సైజ్‌ అధికారి బి.కిరణ్‌ తెలిపారు. ఈ మేరకు శనివారం మహబూబాబాద్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ వద్ద వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌ ఎక్సైజ్‌ పరిధి అనంతారం గ్రామ శివారుతోపాటు అనంతారం నుంచి కురవి మండలం మొగిలిచర్ల గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో శుక్రవారం సాయంత్రం ఎక్సైజ్‌ అధికారులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ డీసీఎం అటువైపురాగా ఆ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా అందులో గుడుంబా తయారీ కోసం మహబూబాబాద్‌ జిల్లాకు తరలిస్తున్న 90 క్వింటాళ్ల నల్లబెల్లం, 10 క్వింటాళ్ల పటిక, 60 లీటర్ల గుడుంబా కనిపించింది. దీంతో వాహనాన్ని సీజ్‌చేసి నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకుని మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం రేకుల తండాకు చెందిన గుగులోత్‌ అశోక్‌, మొగిలిచర్లకు చెందిన నీలం వీరన్న, కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన సంగు నరేశ్‌పై కేసు నమోదు చేశామని, కోదాడకు చెందిన కోనేరు మురళీమోహన్‌ పరారీలో ఉన్నారని తెలిపారు. కాగా, పట్టుకున్న వాహనం, బెల్లం, పటిక విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని జిల్లా ఎక్సైజ్‌ అధికారి పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్‌ సీఐ జి.చిరంజీవి, ఎస్సై అశోక్‌ కుమార్‌, హెడ్‌కానిస్టేబుల్‌ మధు, కానిస్టేబుళ్లు శేఖర్‌, సాలెం రాజ్‌, శ్రీనివాస్‌, రవి, వెంకటనరసయ్య, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- రూ.1.30 లక్షల నగదు అపహరణ
- గంగారంలో ఘటన


తెరిచి ఉన్న బీరువా

కాటారం : తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం కాటారం మండలం గంగారంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు సంతోషం గొరక్క ఒంటరిగా నివసిస్తోంది. నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తలుపు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తెరిచి అందులో ఉన్న రూ.1.30 లక్షల నగదును అపహరించుకెళ్లారు. శనివారం ఇంటికి చేరుకున్న గొరక్క తలుపు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులో నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుంది. వెంటనే చుట్టుపక్కల వారికి తెలుపగా పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు, క్లూస్‌ టీం ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చోరీపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై అభినవ్‌ తెలిపారు.